ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 346 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 24 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్
# నిజస్వరూపం బహిర్గతం



### తెలంగాణలో డీలిమిటేషన్ వివాదం..
### కిషన్ రెడ్డి ఆరోపణలు
### తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు
### దక్షిణ భారత అభివృద్ధిపై బీజేపీ దృక్పథం

**హైదరాబాద్, మార్చి 23 (ప్రభాత ఉదయం):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యా లయంలో నిర్వహించిన మీడియా సమావే శంలో కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసంగంలో కీలక అంశాలు వెలువ డ్డాయి. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నిజస్వ రూపం బయటపడిందని పేర్కొన్నారు. చెన్నైలో జరిగిన సమావేశంలో ఈ రెండు పార్టీలు పోటీపడి మాట్లాడిన తీరు, దేశంలో లేని సమస్యను సృష్టించి బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పనిచేయడం, వారి అసలు ఉద్దేశ్యాన్ని బహి ర్గతం చేసిందని తెలిపారు. డీలిమిటేషన్ అంశంపై ఇప్పటివరకు పార్లమెంట్‌లో కానీ, కేబినెట్‌లో కానీ ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టంగా తెలిపారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందన్న తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. తమిళనాడులో డీఎంకే పాలన అవినీతితో నిండిపోయిందని, స్టాలిన్ కుటుంబ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దాచిపెట్టేందుకు డీలిమిటేషన్ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులో కూడా అదే విధంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ దక్షిణాదిలో బలపడకూడదన్న కుట్రతో కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్ ..మిగతా 2లో




## నేను కేసీఆర్ అంత
# మంచోడిని కాదు
## ఎవ్వర్నీ వదిలిపెట్టను: కేటీఆర్

**కరీంనగర్ మార్చి 23 (ప్రభాత ఉదయం):** తాను కేసీఆర్ అంత మంచోడిని కాదని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి కేటీఆర్. కరీంనగర్ బీఆర్ఎస్ సన్నాహక సభలో కేటీఆర్ మాట్లాడారు. 'ఇవాళ సన్నాహక సమావేశాన్ని చూస్తే బీఆర్ఎస్ ఎంత బలంగా ఉందో అర్థమైతుంది. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గడ్డ కరీంనగర్. తెలంగాణ సెంటిమెంట్ లేదన్న రోజున కేసీఆర్‌ను 2 లక్షల మెజారిటీతో గెలిపించి వాదాన్ని నిలబెట్టిన గడ్డ కరీంనగర్. గత పదిహేను నెలలుగా అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్న ప్రతిపక్షం బీఆర్ఎస్. ఉద్యమం నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టి చంపమన్న నాయకుడు కేసీఆర్. ఇవాళ భూమికి జానెడున్నోడు కూడా ఎగిరెగిరి పడుతున్నాడు. వానపాములు బుసలు కొడుతున్నై, గ్రామసింహాలు సింహాలనుకుంటున్నై. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. బీజేపీ 1992లోనే ఒక్క ఓటు పేరు, రెండు రాష్ట్రాల పేరిట మోసం చేసింది. కాంగ్రెస్ మోసాలు చేస్తూనే ఉంటుంది ఇవాళ ఏం రైతును కదిలించినా కన్నీళ్లే వస్తున్నాయి. ఇవాళ రైతులకు కేసీఆర్ గుర్తుకొస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎమర్జెన్సీ, ..మిగతా 2లో

## ఎస్ఎల్‌బీసీలో 31వ రోజుకు చేరుకున్న
# రెస్క్యూ ఆపరేషన్



### సహాయక చర్యల్లో పురోగతి

**అచ్చంపేట, మార్చి 23 (ప్రభాత ఉదయం):** దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్ ఆదివారం 31వ రోజుకు చేరుకున్నది. టన్నెల్ ఆఫీస్ వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీ-1, డీ-2 ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు, డి-వాటరింగ్‌ను బయటకు పంపే ప్రక్రియ వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాద ప్రదేశాన్ని ..మిగతా 2లో

# గాజా మృత్యుఘోష
## 50 వేలు దాటిన మరణాలు



**గాజా, మార్చి 23 (ప్రభాత ఉదయం):** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 1.13లక్షల మంది గాయపడినట్లు తెలిపింది. ఇటీవల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వారం వ్యవధిలోనే మళ్లీ దాడులు మొదలుకాగా.. వీటిలో దాదాపు 673 మంది చనిపోయారు. అయితే, మొత్తం మరణించిన వారిలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై గాజా ఆరోగ్యశాఖ స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఇజ్రాయెల్ మాత్రం దాదాపు 20వేల మంది మిలిటెంట్లను ..మిగతా 2లో

# రాజస్తాన్‌పై ఎస్ఆర్‌హెచ్ గ్రాండ్ విక్టరీ
## ఎస్ఆర్‌హెచ్ ఘన విజయం



**హైదరాబాద్, మార్చి 23 (ప్రభాత ఉదయం):** ఐపీఎల్ 2025 రెండవ మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. తొలి మ్యాచ్ ఆడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సొంత గడ్డపై రాజస్థాన్ రాయల్స్ ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ ఆరు వికెట్లకు 286 పరుగులు చేసింది. 287 లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాజస్థాన్ 242 పరుగులకే పరిమితమైంది. 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి ఓటమి పాలైంది. ధ్రువ్ జురేల్, సంజుశాంసన్ ఇద్దరూ హాఫ్ సెంచరీలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శుభమ్ దూబే, హిట్ మేయర్ చివరి వరకూ ప్రయత్నించారు. 287 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. షమి వేసిన తొలి ఓవర్‌లో 16 పరుగులు సాధించింది. సిమర్‌జీత్ సింగ్ బౌలింగ్‌లో అభినవ్ మనోహర్‌కు క్యాచ్ ఇచ్చి యశస్వి జైశ్వాల్ (1) వెనుదిరిగాడు. కెప్టెన్ రియాన్‌పరాగ్ (4) కూడా సిమర్‌జీత్ సింగ్ చేతిలో ఔట్ అయ్యాడు. ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీశాడు సిమర్‌జీత్. మహమ్మద్ షమీ చేతి బౌలింగ్‌లో నితీశ్ రాణా (11) పెవిలియన్‌కు చేరుకున్నాడు. అనంతరం ధ్రువ్ జురేల్, సంజుశాంసన్ మంచి భాగస్వామ్యం కొనసాగించారు. రాజస్థాన్ రాయల్స్ వెంటవెంటనే రెండు వికెట్లు కోల్పోయింది. హర్షల్‌పటేల్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి సంజు శాంసన్ (66) పెవిలియన్ బాటపట్టాడు. ఆడం జంపా బౌలింగ్‌లో ధ్రువ్ జురేల్ (70) ఔట్ అయ్యాడు. శుభమ్ దూబే (34), హిట్ మేయర్ (42) అద్భుతంగా రాణించిన ఫలితం లేకుండా పోయింది.

**ఫస్ట్ ఇన్నింగ్స్‌లో..**

హైదరాబాద్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ (67), ఇషాన్ కిషన్ (106) ..మిగతా 2లో




# ఆర్టీసీ బస్సు-కారు ఢీ
### ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
### సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**చివ్వెంల: మార్చి 23 (ప్రభాత ఉదయం):** సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు- కారు ఢీకొని దంపతులు, ఎనిమిదేళ్ల కుమార్తె ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. తీవ్ర గాయాల పాలైన మరో ముగ్గురి ..మిగతా 2లో

# రాజస్తాన్‌పై ఎస్ఆర్‌హెచ్ గ్రాండ్ విక్టరీ

మొదటి పేజీ తరువాయి...

విధ్వంసం సృష్టించారు. హెడ్ 21 బంతుల్లో అర్ధ శతకం అందుకోగా.. ఇషాన్ 45 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. హెన్రిచ్ క్లాసెన్ (34), నితీశ్ కుమార్ రెడ్డి (30), అభిషేక్ శర్మ (24) కూడా క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 3, మహీశ్ తీక్షణ 2, సందీప్ శర్మ ఒక వికెట్ పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్ నాలుగు ఓవర్లలో ఏకంగా 76 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో చరిత్రలో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు.
మరోవైపు.. సిమర్‌జీత్ సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ షమీ(1), ఆడమ్ జంపా(1), హర్షల్ పటేల్ (2) చొప్పున వికెట్లు తీశారు. కాగా.. ఈ మ్యాచ్ కొత్త రికార్డు నమోదైంది. సన్‌రైజర్స్ చేసిన 286 పరుగులు ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరు. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు కూడా ఎస్ఆర్‌హెచ్‌దే. గత ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఆ జట్టు మూడు వికెట్లకు 287 పరుగులు చేసింది. మరోసారి తన రికార్డును తీనే బద్దలు గొట్టింది సన్‌రైజర్స్ హైదరాబాద్..





చిన్నారులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు ఏపీ మిథున్ రెడ్డి

## పుట్టుచీర మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు ఏపి మిథున్ రెడ్డి

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం ఏనుగొండలోని ఓం కన్వెన్షన్ హాల్లో శ్రీనివాస్ కాలనీ కి చెందిన చింతకింది శ్రీను గారి సోదరుడు చింతకింది ఈశ్వర్ గారి కుమార్తె పుట్టుచీర మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఏపి మిథున్ రెడ్డి గారు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నిజస్వరూపం బహిర్గతం

మొదటి పేజీ తరువాయి...

పార్టీలు కలసి దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజల పట్ల తమ విధేయతను నిరూపించుకున్న బీజేపీ, రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా వివక్ష లేకుండా అభివృద్ధి పనులను కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన గురించి చట్ట ప్రక్రియ చాలా స్పష్టమైనదని, ముందుగా జనాభా లెక్కల సేకరణ జరగాల్సి ఉంటుందని, ఆ తర్వాతే చర్చలు, నిర్ణయాలు తీసుకోవచ్చని వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ కలిసి డీలిమిటేషన్ అంశాన్ని కేంద్రంపై దుష్ప్రచారానికి వాడుకోవడం తగదని పేర్కొన్నారు. గత పదిన్నరేళ్లుగా నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, సమర్థవంతమైన పరిపాలనతో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎస్ఎల్‌బీసీలో 31వ రోజుకు చేరుకున్న రెస్క్యూ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి...

మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని వివరించారు. సంఘటన జరిగిన నాటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లో 24 గంటల పాటు శ్రమిస్తున్నాయని వెల్లడించారు.

**సహాయక చర్యల్లో పురోగతి**

టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) కత్తిరించిన భాగాలను తొలగిస్తూ, వాటర్ జెట్ ద్వారా బురదను తొలగిస్తున్నారు. ఎస్కవేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. ప్రమాద ప్రదేశం వరకు విద్యుత్, వెంటిలేషన్ పునరుద్ధరణ పూర్తయిందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులు, ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, ఎస్‌డీఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే, అన్వి రోబోటిక్స్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్ వనస్థలిపురం, ఎఫ్.సి.ఐ. కాలనీలో అడ్డాకల్ మండలం మాజీ ఎంపీపీ ఎల్లా గౌడ్ గారి కుమారుడు డాక్టర్ జి.వి.కె.ఆర్.గౌడ్ గారు నూతనంగా నిర్మించిన న్యూరో హాస్పిటల్ లోని ఫార్మా వార్డులను ప్రారంభించిన మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గౌరవ శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి గారు, మరియు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే గౌరవ శ్రీ ఆల వెంకటేశ్వర్ రెడ్డి గారు హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన హాస్పిటల్ లోని ఫార్మా వార్డులను ప్రారంభించారు, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడు గారు, కానాయ పల్లి మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్య సాగర్ గారు, శంకర్ గౌడ్ గారు, అడ్డాకల్ మాజీ ఎంపీపీ ఎల్లా గౌడ్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రుణమాఫీ మోసం..

### డీలిమిటేషన్ కుట్రలపై జగదీశ్‌రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మార్చి 23 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ రుణమాఫీ మోసం, బీజేపీ డీలిమిటేషన్ కుట్రలపై సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఆదివారం మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. అసెంబ్లీ అనే సోయి లేకుండా అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి చేతులెత్తేసిందన్నారు. చేయని రుణమాఫీ చేసినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. అమలు సాధ్యం కాదని తెలిసి అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల ముందు బ్యాంకులకు వెళ్లండని రైతులతో రుణాలెత్తించి.. నట్టేట ముంచారని మండిపడ్డారు. బ్యాంకుల లెక్క ప్రకారం రూ.49,500 కోట్లు.. కాంగ్రెస్ చెప్పేది రూ.20వేలు కోట్లని.. కానీ చివరకు మాఫీ చేసింది రూ.12,500 కోట్లు మాత్రమేనన్నారు. బ్యాంకులు చెప్పిన దానికి కేబినెట్, బడ్జెట్, అసెంబ్లీకి వచ్చే సరికి 30శాతం కూడా మాఫీ కాలేదన్నారు. చెప్పిన హామీలు ఒక్కొక్కటిగా ఎత్తేస్తున్నారని.. రుణమాఫీ పోయిందని.. బోనస్ లేదని.. సాగునీళ్లు కూడా లేవన్నారు. అన్నింటికీ మొండి చేతులే చూపిస్తున్నారని విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదని కాంగ్రెస్ భావిస్తున్నట్లుగా ఉందని.. అందుకే సంక్షేమం మరచి జేబులు నింపుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో మంత్రులు అబద్ధాలు చెప్పిన సందర్భం చరిత్రలోనే ఎప్పుడూ జరుగలేదని.. అసెంబ్లీలో అబద్ధాలాడిన రికార్డు కూడా కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుందని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన హామీల బాధ్యత పూర్తిగా మరిచారని.. అసమర్థ ప్రభుత్వాన్ని ఎలా భరించాలని ప్రజలు ఆవేదన పడుతున్నారన్నారు. బడే భాయ్ దగ్గర మాట తీసికుని ఛోటే బాయ్ మ్యాచ్ ఫిక్సింగ్.. కిషన్ రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణాదితో పాటు ఉత్తరాదిలో కూడా వ్యతిరేకత వస్తుందని.. కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడితే చివరకే మోసమే ఎదురవుతుందన్నారు. బీజేపీ కుట్రలు ఎట్టి పరిస్థితుల్లో సాగనివ్వమన్నారు. ఫెడరల్ స్ఫూర్తి కొనసాగాలంటే రాష్ట్రాల ఐక్యత ముఖ్యమని.. తెలంగాణ హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు.







## నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు

మొదటి పేజీ తరువాయి...

అణిచివేత రాజ్యం. నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు. మనకు సమయం వస్తుంది. అప్పుడు అన్ని లెక్కలు తేలుస్తాం. విదేశాల్లో దాక్కున్నా పట్టుకొస్తాం. ఈ ప్రభుత్వం 5 డీఏలు బాకీ ఉంది. 16 నెలల్లో 6 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని యువత బాధ పడుతోంది. ఈ ఏడాది మొత్తం రజతోత్సవం చేసుకుందాం. ఏప్రిల్ 27న ఆవిర్భావ సభకు అందరూ కదిలి రావాలి. దక్షిణ భారతానికి నష్టం వాటిల్లబోతోందని తమిళనాడు సదస్సు నిర్వహించింది. కుటుంబ నియంత్రణ పాటించినందుకు మనకు ఉత్తరాది నాయకులు ప్రాతినిథ్యం తగ్గించి దక్షిణాదిని చిన్నచూపు చూస్తున్నాయి. ఎక్కడెక్కడైతే జనాభా తగ్గిందో అక్కడ సీట్లు తగ్గిస్తామంటోంది. అయోధ్య తలంబ్రాల పేరిట సెంటిమెంట్ పూసారు. అవి అయోధ్య వి కావు, ఉత్తినే. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌ని ఏదడిగినా శివం, శవం ముచ్చట తప్ప వేరే లేదు. బడి కట్టినా, గుడి కట్టినా బీఆర్ఎస్ నాయకులే కట్టారు. పదేళ్లలో కడుపులో సల్ల కదలకుండా చూసుకున్నాడు కేసీఆర్. తెలంగాణాలో దోచి ఢిల్లీకి కట్టబెడుతున్నారు. బీఆర్ఎస్ మీద ద్వేషం, అసూయ, ఆశ అనే అంశాలను ప్రయోగించి దుష్ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరం'అని పిలుపునిచ్చారు.



## ముంబైకి షాక్..

### రచిన్ అజేయ అర్ధశతకంతో సీఎస్కే జయభేరి

ఐపీఎల్ 18వ సీజన్‌లో థ్రిల్లింగ్ మ్యాచ్. విజయం ఇరుజట్లతో దోబూచులాడిన వేళ.. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ మురిసింది. స్వల్ప ఛేదనలో ఆద్యంతం ఉత్కంఠ నెలకొన్నప్పటికీ ముంబై ఇండియన్స్‌ను 4 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(53) అర్ధ శతకంతో మంచి పునాది వేయగా.. ఓపెనర్ రచిన్ రవీంద్ర(65 నాటౌట్) ఆఖరి వరకూ నిలబడి విజయతీరాలకు చేర్చాడు. స్పిన్నర్ విఘ్నేశ్ పుతుర్ కట్టుదిట్టంగా బంతులు వేసినా.. రెండు సిక్సర్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు రచిన్. దాంతో, సీఎస్కే తమ గెలుపుతో టోర్నీని ఆరంభించింది.

ముంబై నిర్దేశించిన స్వల్ప ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ తడబడుతూ సాగింది. ఓపెనర్ రాహుల్ త్రిపాఠి(2) నిరాశపరచగా.. రచిన్ రవీంద్ర(65 నాటౌట్) క్రీజులో పాతుకుపోయాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(53) అండగా స్కోర్ బోర్డును ఉరికించాడు. సెట్ అయ్యాక దంచేసిన గైక్వాడ్ అర్ధ శతకం బాదేయడంతో సీఎస్కే విజయం నల్లేరు మీద నడకే అనిపించింది. కానీ, యంగ్ స్పిన్నర్ విఘ్నేశ్ పుతూర్(3-32) మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చేశాడు. స్లో డెలివరీలతో అతడు.. వరుసగా గైక్వాడ్, శివం దూబె(9), దీపక్ హుడా(3)లను బోల్తా కొట్టించాడు.

## ఆర్టీసీ బస్సు-కారు ఢీ

మొదటి పేజీ తరువాయి...

పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులను గడ్డం రవీందర్, రేణుక, రితిక(8)గా గుర్తించారు. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న కారు పరస్పరం ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. పెద్ద శబ్దం రావడంతో హుటాహుటిన స్థానికులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సు, కారు వేగంగా రావడం, మలుపు తీసుకొనే క్రమంలో కారు అదుపు తప్పి బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారు వెనుక భాగంలో కూర్చొన్న రేణుక, రితిక.. డ్రైవర్ పక్కన కూర్చొన్న రవీందర్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే, కారు వేగంగా రావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? బస్సు వేగంగా రావడం వల్లా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో విషాద ఛాయలు అలముకున్నాయి.

## గాజా మృత్యుఘోష

మొదటి పేజీ తరువాయి...

చంపినట్లు పేర్కొంది. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత మళ్లీ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్.. తాజాగా దక్షిణ గాజాపై భీకర దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ రాజకీయ నేత సహా పలువురు మహిళలు, చిన్నారులు చనిపోయారు. రఫా నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే ఆదేశించింది. దీంతో పాలస్తీనావాసులు తమ సామగ్రిని పట్టుకొని దుమ్ము రోడ్లపై బారులు తీరిన పరిస్థితి కనిపించింది.

# అకాల వర్షానికి నేలరాలిన మామిడి, వరి పంటలు



మామిడి పంటతో నష్టపోయిన రైతు నరేందర్ రెడ్డి



భారీ వర్షానికి నేలకొరిగిన వరి పంట



గాలివానకు రాలిన మామిడికాయలు

కొత్తకోట, మార్చి 23(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లాలో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షానికి కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి,కానాయపల్లి,అమడబా కుల గ్రామాలలోని వరి,మామిడి పంటలు సాగు చేస్తున్న రైతులకు నష్టం వాటిల్లింది.వరి పంట వర్షానికి నేలకొరిగింది,మామిడి కాయలు నేలరాయి.ప్రస్తుతానికి సుమారుగా 10 ఎకరాలలో వరి,మామిడి తోటల వర్షానికి దెబ్బ తినడంతో ఏడు లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.ఇదిలా ఉండగా నిన్న వనపర్తి జిల్లాలో కురిసిన అకాల వర్షం కొత్తకోట మండలంలో 10.4 మిల్లీమీటర్లు పెద్దమందడి మండలంలో 8.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట వివరాలను సేకరిస్తున్నారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి





నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు






బుద్వేల్, మార్చి23 (ప్రభాత ఉదయం) నీటిని పొదుపుగా వాడుకోవాలని రాజేంద్రనగర్ జలమం డలి జనరల్ మేనేజర్ సాయిలక్ష్మి అన్నారు. పుష్పగిరి రూరల్ డెవలప్మెంట్ సోసైటీ ఆధ్వర్యంలో ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ లోని అపార్ట్మెంట్లు, కాలనీ ల ప్రజలకు నీటి పొదుపు పై ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భం గా సాయిలక్ష్మి మాట్లాడుతూ, నీటిని వృదా చేయవద్దన్నారు. జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఖాజా జోహార్ అలీ మాట్లాడుతూ, నగర ప్రజలకు త్రాగునీటి ని చాలా దూరం నుంచి తీసుకువచ్చి తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నామని, అయితే త్రాగునీటిని కేవలం త్రాగునీటి కోసమే వాడుకోవాలన్నారు. వాహనాలను కడుగటం, బయట కడుగడం లాంటి వాటి కోసి రక్షిత మంచినీటి ని వాడకూడదన్నారు. ప్రతి అపార్ట్మెంట్ ముందు, ఇంటి ముందు ఇంకుడు గుం తలను ఏర్పాటు చేసుకుంటే భూ గర్భ జలాలను పెంపొందించేందుకు కారకులైన వారమవుతామన్నారు. అత్తాపూర్ తీర పోర్సేసన్ అపార్ట్మెంట్ లో ప్రజలకు నీటి పొదువు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సాజద్ అలీ, పుష్పగిరి స్వచ్ఛం ద సంస్థ నిర్వాహకులు బి.పుష్పలీల, యాదగిరి, హరిప్రియ, ఆపార్ట్మెంట్ వాసులు రాం సుబా-రెడ్డి, సరిత కుందు, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అదనపు తరగతి గదులు

## ప్రారంభానికి సిద్ధంగా అదనపు తరగతి గదులు

బుద్వేల్, మార్చి23 (ప్రభాత ఉదయం): ప్రాంక్లిన్ టెంపుల్ టన్ సంస్థ ఆర్థిక సహకారంతో రౌండ్ టేబుల్ ఇండియా మధ్య వర్తిత్వంతో అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులు, మూత్ర శాలలు నిర్మించారు. ఆ అదనపు తరగతి గదులను ఈ నెల 25న దాతలు ప్రారంభించనున్నారు. అతి తక్కువ సమయంలో దాతలు ముందుకు వచ్చి అతా పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతులు, మూత్రశాలలు నిర్మించిన ప్రాంక్లిన్ టెంపుల్ టన్ సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పాఠశాల ప్రధానో పాద్యాయురాలు కె.శ్రీలత, రాజేంద్రనగర్ మండల పీఆర్టీయు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, ఉపాద్యాయులు తెలిపారు.



పంతంగి రాజ్ భూపాల్ గౌడ్‌ను సన్మానిస్తున్న అడికె రాజు

## బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షునికి సన్మానం

బుద్వేల్, మార్చి23(ప్రభాత ఉదయం): బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన పంతంగి రాజూపాల్ డ్ను ఆదివారం ఆ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జీ అడికె రాజు కలసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాజూ పాల్ గౌడ్ ను కలసిన వారిలో నాయకులు అడికె మహేందర్, సేడెం వెంకటరమణ గుప్తా, గూడిరి అంజి, భాస్కర్, మహేశ్, జయరాం, అంకిత్, చింటురెడ్డి, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల తిరుపతి దేవస్థానములో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మహిళా నాయకురాలు లక్ష్మీ రాజ్



కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ని కలసిన ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ ఉద్యోగులు

## ఎన్ఐఆర్డీపీఆర్‌కు వచ్చి సమస్యలు తెలుసుకుంటా

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

బుద్వేల్, మార్చి23 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐర్డీపీఆర్) ను ప్రైవేటు పరం చేయకుండ కాపాడాలని, సంస్థకు బడ్జెట్ కేటాయింపులు చేసేలా చూడాలని కోరుతు ఆదివారం ఆ సంస్థకు చెందిన ఉద్యోగులు కేంద్ర మం త్రి జి.కిషన్ రెడ్డి ని ఆయన నివాసం లో కలసి వినతి పత్రం అందజేశారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు లతో కలసి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ని ఎన్ఐ ఆర్ డీ పీఆర్ ఉద్యోగులు కలిశారు. ఉద్యోగులు చెప్పిన అన్ని విషయాలను విన్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి త్వరలోనే మీ సంస్థకు వచ్చి పరిస్థితులను తెలుసుకుంటానని. ఆ తర్వాత ప్రధానమంత్రి దృష్టికి ఎన్ ఐ ఆర్ డీ పీఆర్ సమస్యను తీసుకువెళతానన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలసిన వారిలో సంస్థ ఉద్యోగులు డాక్టర్ కతిరేశన్, డాక్టర్ రమేశ్ శక్తివేల్, డాక్టర్ రాజేశ్ సిన్హా, డాక్టర్ శ్రీనివాస్ సజ్జ లు ఉన్నారు.



భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఏర్వ కుమార స్వామీ, తదితరులు

## భగత్ సింగ్ పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలి

బుద్వేల్, మార్చి23(ప్రభాత ఉదయం) : రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడిం చిన అమర వీరులు భగత్ సింగ్, రాజ్ గరు, సుఖ్ దేవ్ ఆశయాలను నిజం చేయడానికి యువత కృషి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ నవ యువ యువ జన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామీ అన్నారు. ఆదివారం మైలార్దేవుపల్లి డివిజన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డు శ్రీ రాంనగర్ చౌరస్తా వద్ద షాహిద్ దివస్ సందర్భంగా వీర మరణం పొందిన వీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీశ్, ఉపాధ్యక్షులు రమేశరెడ్డి లు పాల్గొని అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్సింగ్, రాజ్గురు, సుఖోవ్ లాంటి మహానీయులు త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.





గ్రాడ్యుయేషన్ డే లో చిన్నారులకు సర్టిఫికెట్ ల బహుకరణ



బహుమతులు పొందిన జలాల్ బాబా నగర్ విద్యార్థులు

## ఘనంగా బానోదయ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డే, కల్చరల్ ఫెస్ట్

బుద్వేల్, మార్చి 23(ప్రభాత ఉదయం):విద్యార్థులను తీర్చి దిద్దుతున్న ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సహకరించాలని రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు ఎం ప్రభాకర చారి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పాండురంగ నగర్ లో గల భానోదయ హై స్కూల్ లో శనివారం సాయంత్రం జరిగిన గ్రాడ్యుయేషన్ డే , కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇది వారి జీవితాలలో మరుపురాని ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. చదువుతోపాటు క్రీడా పోటీలలో సాంస్కృతిక కార్యక్రమాలలో బానోదయ హై స్కూల్ విద్యార్థులు ఎంతోగానో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ విద్యార్థి సంఘం అధ్యక్షులు జంపాల రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఏ ఏ రంగాలలో ఇష్టం ఉందో దానిని గుర్తించి తల్లిదండ్రులు ఆయా రంగాలపట్ల వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కూడా అనేక ప్రోత్సహాలను అందిస్తుందన్నారు. రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల కోశాధికారి ఎస్ ఆర్ రజనీకాంత్ మాట్లాడుతూ, విద్యార్థులను పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రుల కృషి ఎంతో గొప్పదన్నారు. ముఖ్యంగా తల్లులు తమ పిల్లల చదువు పట్ల చూపిస్తున్న శ్రద్ధాక్తులు వెల కట్టలేనివని తెలిపారు. భానోదయ హై స్కూల్ కరస్పాండెంట్ బి భాస్కర్ మాట్లాడుతూ, తల్లిదండ్రుల సహకారంతో 20 సంవత్సరాలుగా పాండురంగానగర్ లో వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. జలాల్ బాబా నగర్ బ్రాంచ్ విద్యార్థులతో పాటు పాండురంగ నగర్ లో ఉన్న భానోదయ హై స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయడం జరిగిందన్నారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. నాసా పోటీ పరీక్షలలో రాణించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్ లను అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్ సతీష్, భానోదయ హై స్కూల్ నిర్వాహకురాలు బి భవాని, అడ్మిన్ సంతోషిణి భట్, రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి శరవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ అప్పారెడ్డి గూడెం భీమయ్య తో పాటు ఉపాధ్యాయునీ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.




కొత్తకోట పట్టణ కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

## మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

కొత్తకోట, మార్చి 23(ప్రభాత ఉదయం) ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు,రిజర్వేషన్లు బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ సంఘం మండల నాయకులు జే.ఇబ్రాయిల్, ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత సంఘ నాయకులు పాల్గొని మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ కొమ్ము భరత్ భూషణ్, దండోరా మాజీ జిల్లా అధ్యక్షులుజే.మిషేక్ మాదిగ, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, అయ్యన్న మాదిగ, గాడిల ప్రశాంత్, బుడగ జంగం శ్రీనివాసులు,ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,కిరణ్ కుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



కొత్తకోట పట్టణ కేంద్రంలో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

### భగత్ సింగ్ ఆశయాలను
# ముందుకు తీసుకెళ్లాలి
### సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్

కొత్తకోట, మార్చి 23(ప్రభాత ఉదయం) భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం కొత్తకోట మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ... భగత్ సింగ్ తన జీవితాన్ని దేశ స్వతంత్రం సాధన కోసం పోరాడి నిలిచారని ఆయన చెప్పారు. దేశంలో శ్రమను జీవుల ప్రకృతి వనరులు దోపికి గురైనంతకాలం విప్ల ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భగత్ సింగ్ మొదటిగా గ్రంథాలను అధ్యయనం చేయడం ప్రారంభించాడని భగత్ సింగ్ చాలా పిన్న వయసులో తన 33వ ఏటనే మరణించాడని ఆయన రాజకీయ ఆలోచన ఆచరణ అతిపిన వయసులోనే రూపొందించడం ప్రారంభమైందని చెప్పారు. ఉరిశిక్షకు ఎదురుచూస్తూ 1930–31 మధ్య జైలలో ఉన్నప్పుడు భగత్ సింగ్ రాసిన రెండు వ్యాసాలు తన అనుచరులకు రాసిన అశేష లేఖాలను చేసిన ప్రకటనలను పరిశీలించితే ఆయన ఒక విధంగా యువతారానికి భగత్ సింగ్ వీలునామగా పరిగణించవచ్చు చెప్పారు. మార్క్స జానకి పూర్తిగా అంకితమైన ఒక విప్లవకారుడు గాను పయనించాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి నరసింహ, కే వెంకటయ్య, మేస్త్రి వెంకటయ్య, రాజు, కొండన్న, బాలరాజు, కృష్ణయ్య, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.



### భగత్ సింగ్ త్యాగం
# నేటి యువతకు స్పూర్తి
### సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు

గద్వాల టౌన్, మార్చి23 (ప్రభాత ఉదయం)భగత్ సింగ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు చదవాలి, మార్పుకై పోరాడాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, లెక్చరర్ గంట పరేష్ బాబు అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిరుప్రయంలోనే భారత మాత ముద్దు బిడ్డ విప్లవ వీరుడు షహీద్ సర్దార్ భగత్ సింగ్ దేశం కోసం ఉరి తాడును ముద్దాడి ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిం చారని, నాటి పరాయి పాలనకు దోపిడీకి వ్యతిరేకంగా నిస్వార్థంగా పోరాడిన త్యాగ ధనుడని పేర్కొన్నారు. నాడు పరాయి పాలకులు మనకు పీడనగా కొనసాగితే నేడు స్వదేశ పాలకులు పీడనకు పాల్పడుతున్నారని, భగత్ సింగ్ చరిత్రను లేకుండా చేస్తూ, ఆయనను దేశ ద్రోహిగా పేర్కొనడం దుర్మార్గం అన్నారు. భగత్ సింగ్ ఐడియాలజీ సిద్ధాంతాలు నచ్చని అధికారంలో ఉన్న కేంద్ర పార్టీ ఆయన మీద కుట్రలు పన్ని విష ప్రచారాన్ని చేయడం సిగ్గుచేటని అన్నారు. భగత్ సింగ్ ఆశయాలు నెరవేరే సమయం వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఏల్కూరు రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పరమేష్, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు తిమ్మప్ప, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు తాటికుంట వెంకటేష్, టిపిఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నాగన్న, ఆటో రామన్న, ఏఐటీయూసీ కార్మికులు, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



### అర్హులైన ప్రతి ఒక్కరికి
# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
### ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి
### కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

గద్వాల టౌన్, మార్చి23,( ప్రభాత ఉదయం) కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆదివారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గద్వాల మున్సిపాలిటీతో పాటు గద్వాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన 900 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, వైస్ చైర్మన్ శ్రీకాంత్, వివిధ మండలాల రెవెన్యు అధికారులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ గెలుపు తథ్యం
### గద్వాల జిల్లా నూతన అధ్యక్షుడి ప్రమాణం స్వీకారోత్సవంలో ఎంపీ డీకే. అరుణ





గద్వాల టౌన్: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ లో బీజేపీ గెలుపు తథ్యం అని జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ఎస్ వీ ఈవెంట్ హాల్ లో గద్వాల జిల్లా బీజేపీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపీ డీకే అరుణ, ఆదోని ఎమ్మెల్యే పార్థ సారధి, నాగర్ కర్నూల్ బీజేపీ కాంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, పార్టీ జనరల్ సెక్రటరీ డీకే స్నిగ్ధారెడ్డి పాల్గొన్నారు. గద్వాల జిల్లా నూతన అధ్యక్షులుగా టి. రామాంజనేయులు, కార్యవర్గులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎంపీ డీకే అరుణ ను గజమాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ నూతన జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు ఆధ్వర్యంలో గద్వాల జిల్లా బీజేపీ కార్యకర్తలు అంతా కష్టపడి పని చేయాలని, బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయాలని సూచించారు. 70 వేల ముస్లింల ఓట్లు ఉన్న ఆదోనిలో బీజేపీ ఎమ్మెల్యే గా పార్థ సారధి గెలిచారని, ఆయన గెలుపును స్పూర్తిగా తీసుకొని గద్వాలలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. గత నాగర్ కర్నూల్ ఎంపీ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గంలో 20 వేల మెజారిటీ వచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గద్వాలలో బీజేపీ పార్టీ తప్పకుండా ఎగురవేస్తామని అన్న నమ్మకం కార్యకర్తల్లో నింపే బాధ్యత నాయకులకు ఉందన్నారు. తెలంగాణ లో బీఆర్ఎస్ పార్టీ అరాచకాలను వద్దనుకుని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారని, బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా పోరాటలు చేసింది బీజేపీ పార్టీ అని, కాని ప్రభుత్వం ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. తెలంగాణలో మిషపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి, అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని విమర్శించారు. బీజేపీ తరపున హామీలు ఇచ్చిందని కానీ అధికారం కోసం పాకులాడే పార్టీ బీజేపీ కాదని గుర్తు చేశారు. ఈ దేశం కోసం, ఇక్కడి ప్రజల ఆర్థిక ప్రగతి కోసం పని చేసే నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని కొనియాడారు. రైతులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా



రుణమాఫీ చేసి, చేతులు దులుపుకోందని విమర్శించారు. రైతు భరోసా పూర్తి చేయలేదని, ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఖజానాలో పైసలు లేవని చెప్పడం సిగ్గు చేటు అని అన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తున్నారని, కాంగ్రెస్ హామీలు ఇచ్చి కేంద్రం నిధులు ఇస్తలేదని నిందలు వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై అవగాహన లేదని విమర్శించారు. ఎన్ని ట్రిప్పుల ఇసుక కొట్టారు, ఎక్కడ నుంచి ఎంత వస్తున్నది, ఎక్కడ ఎక్కడ భూములు కబ్జాలు చేయొచ్చు, ఇలా పోటీపడి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అక్రమ సంపాదనకు మరిగారు అని ఆరోపించారు. తాను మహబూబ్ నగర్ ఎంపీగా ఉన్నప్పటికీ.. ఎల్లపుడు మీకు ఫోన్ లో అందుబాటులోనే ఉంటాను అని, కార్యకర్తలకు ఏ ఆపదవచ్చిన ఒక్క ఫోన్ కాల్ తో వచ్చి వాల్లిపోతా అని సూచించారు. మీరు కష్టపడి పని చేయండి మీకు నేనున్నా, కార్యకర్తల్లో ఓవర్ కాన్ఫిడెన్స్ ఉండొద్దు అని అన్నారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చిన కార్యకర్తలు ముందుండి గెలుపు సాధించాలి అని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి బీజేపీ కార్యకర్త పని చేయాలి అని సూచించారు. జిల్లా అధ్యక్షుడుగా రామాంజనేయలు అందరిని కలుపుకు పోవాలి అని, ప్రతి మండలానికి ఒక వాట్సాప్ గ్రూప్ పెట్టుకొని సమాచారం అందరికి చేరవేయాలి అని సూచించారు.

నూతన జిల్లా అధ్యక్షలు రామాంజనేయలు మాట్లాడుతూ ఎంపీ అరుణ పై ప్రశంసలు కురిపించారు. నా 20 ఏళ్ల రాజకీయంలో ఏ పదవి వరించినా అది ఎంపీ అరుణ చలువేఅని కొనియాడారు. తాను కౌన్సిలర్ గా గెలిచినా, మా సతీమణి ఛైర్మన్ గా పనిచేసిన, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గా పనిచేసిన, ఇవాళ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైనా అరుణమ్మ దయ వల్లే అని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థ సారధి మాట్లాడుతూఎంపీ డీకే అరుణ మీకు నాయకురాలిగా ఉండటం మీ అదృష్టం అని, ఆమెఒక్క గద్వాల నాయకురాలే కాదే.. ఢిల్లీ స్థాయిలో పేరున్న నాయకురాలు అని కొనియాడారు. అరుణమ్మ ఆధ్వర్యంలో గద్వాలలో బీజేపీ గెలుపు ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జయలక్ష్మి, గద్వాల ,అల్లంపూర్ పోటీచేసిన అభ్యర్థి లు బలిగేరా శివారెడ్డి, రాజగోపాల్, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు క్రిష్ణ వేణి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

### మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన
# అత్తాపూర్ డివిజన్ బిజెపి నాయకులు రావుల జగన్

రాజేంద్రనగర్, మార్చి 23(ప్రభాత ఉదయం) మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదిన సందర్భంగా ఆదివారం అత్తాపూర్ డివిజన్ బిజెపి నాయకులు రావుల జగన్ చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి ప్రశ్నించే గొంతుక, పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదినం సందర్బంగా అత్తాపూర్ డివిజన్ నాయకులు రావుల జగన్ కలిసి ప్రధాని మోదీ తో వారి కుటుంబ సభ్యులు దిగిన చిత్ర పటాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీ రఘునందన్ రావు జన్మదిన సందర్భంగా చిత్రపటానికి అందజేస్తున్న రావుల జగన్




భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# భగత్ సింగ్‌కు జోహార్లు అర్పించిన సిపిఎం నాయకులు
### భగత్ సింగ్ ఆశయాల కోసం ముందుకు సాగాలి: సిపిఎం బాలాపూర్ మండల కార్యదర్శి ముకుంద గారి చంద్రశేఖర్ రెడ్డి

బాలాపూర్, మార్చి 23(ప్రభాత ఉదయం) భగత్ సింగ్ ఆశయాల కోసం నేటి యువత ముందుకు సాగాలని భారత కమ్యూనిస్టు పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుంద గారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా బాలాపూర్ లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశం కొరకు ప్రాణాలు అర్పించిన యువ వీరులకు నా లాల్ సలాం అన్నారు. భగత్ సింగ్ యువతకు ఎంతో ధైర్యాన్ని ఇస్తూ. దేశం కోసం వాళ్ళ ప్రాణాలను ఉరుకోయ్యలకు తృణపాయంగా అర్పించారన్నారు. అలాంటి వీరులు జన్మించిన ఈ గడ్డపై జన్మించినందుకు నేను ఎంతగానో గర్విస్తున్న వారి త్యాగ ఫలాలను. అనుభవిస్తున్న ప్రతి దేశ పౌరుడువారి అడుగుజాడల్లో నడిచి దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలన్నారు. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ వాయువులకు ఆనాడు వాళ్లు చేసిన త్యాగ ఫలాలు వీరులారా మరవలేము మీ త్యాగాలను మీరు దేశం కోసం చెప్పిన మాటలే మాకు ఆదర్శాలు సూర్యచంద్రులు ఉన్నంతవరకు భూమి ఆకాశము ఉన్నంతవరకు ఈ దేశ ప్రజల గుండెల్లో మీరు చిరస్థాయిగా నిలుస్తారని కొనియాడారు.



### అమెరికా స్టోర్‌లో
# కాల్పులు
### భారతీయ వ్యక్తి, అతడి కుమార్తె మృతి

వాషింగ్టన్: అమెరికా స్టోర్‌లో ఒక వ్యక్తి కాల్పులు జరిపాడు. అక్కడ పని చేస్తున్న భారతీయ వ్యక్తి, అతడి కుమార్తె ఈ కాల్పుల్లో మరణించారు. నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వర్జీనియాలోని అకామాక్ కౌంటీలో ఈ సంఘటన జరిగింది. 56 ఏళ్ల ప్రదీప్ పటేల్, ఆయన 24 ఏళ్ల కుమార్తె ఉర్మి తమ బంధువులకు చెందిన స్టోర్‌లో పని చేస్తున్నారు. గురువారం ఉదయం వారు ఆ స్టోర్‌ను తెరిచారు. ఒక వ్యక్తి మద్యం కొనేందుకు అక్కడకు వచ్చాడు. కాగా, రాత్రి పూట ఆ స్టోర్‌ను ఎందుకు మూసి ఉంచారంటూ ఆ వ్యక్తి ఆగ్రహించాడు. గన్ తీసి తండ్రీ కుమార్తెలపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ప్రదీప్ పటేల్ అక్కడికక్కడే మరణించారు. కుమార్తె ఉర్మిని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. పోలీసులు వెంటనే ఆ స్టోర్ వద్దకు చేరుకున్నారు. నిందితుడైన 44 ఏళ్ల జార్జ్ ఫ్రేజియర్ డెవాన్ వార్టన్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు గుజరాత్‌కు చెందిన ప్రదీప్ పటేల్ కుటుంబం ఆరేళ్ల కిందట అమెరికా వచ్చింది. తమ బంధువైన పరేష్ పటేల్‌కు చెందిన స్టోర్‌లో ప్రదీప్ ఆయన కుమార్తె ఉర్మి పని చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ప్రదీప్ పటేల్‌కు మరో ఇద్దరు కుమార్తెలున్నట్లు బంధువులు తెలిపారు. ఒకరు కెనడాలో, మరొకరు అహ్మదాబాద్‌లో నివసిస్తున్నట్లు చెప్పారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608